ప్రజాశక్తి
శనివారం 18 మే 2024 | 5 | శ్రీ సత్యసాయి





24 నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

నేటి నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఈనెల 24వ తేదీ నుంచి వేరుశగన విత్తనకాయల పంపిణీ ప్రారంభం కానుంది. నేటి నుంచి వేరుశనగ విత్తనకాయలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు వేరుశనగ విత్తన సేకరణ ధరతోపాటు పంపిణీ ధరను నిర్ణయించారు. 40 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పంపిణీ ధర కిలో రూ.57

ఖరీఫ్‌లో ఈ ఏడాది కె-6, టిసిజిఎస్ 1694 రకం రెండు రకాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ట్రూత్‌ఫుల్ లేబుల్ విత్తనకాయలు కిలో రూ.95లు. సబ్సిడీ 40 శాతం ప్రకారం కిలో రూ.38 రాయితీ ఇచ్చారు. రైతుకు పంపిణీ చేస్తున్న ధర కిలో రూ.57. ఒక్కో రైతుకు విస్తీర్ణం బట్టి సరఫరా కేటాయించారు. అర ఎకరంలోపు 30 కిలోల బస్తా, సబ్సిడీపోనూ 30 కిలోల బస్తా రూ.1710 ఇవ్వనున్నారు. అర ఎకరం నుంచి ఒక ఎకరం వరకుంటే రెండు బస్తాలు, ఒక ఎకరంపై ఉన్న మూడు బస్తాలు ఇస్తారు. అంతరపంటల విత్తన సబ్సిడీలు నిర్ణయించాల్సి ఉంది.

81832 క్వింటాళ్లు కేటాయింపు

అనంతపురం జిల్లాకు 81832 క్వింటాళ్లు సబ్సిడీతో పంపిణీకి కేటాయించారు. వేరుశనగ విత్తనకాయలు 76710 క్వింటాళ్లు కేటాయించారు. కంది విత్తనాలు 2300 క్వింటాళ్లు, బ్లాక్ గ్రామ్ 46 క్వింటాళ్లు, పెసలు 85 క్వింటాళ్లు, రాగులు నాలుగు క్వింటాళ్లు, కొర్రలు 50 క్వింటాళ్లు, వరి 1600 క్వింటాళ్లు, దాంచియా 200 క్వింటాళ్లు, పిల్లిపెసర 25 క్వింటాళ్లు, ఉలవలు 700 క్వింటాళ్లు, కౌవ్‌పీ106 క్వింటాళ్లు, సన్‌హెప్ 7 క్వింటాళ్లు మొత్తం 81832 క్వింటాళ్లు కేటాయించారు. ఈ మేరకు మండలాల వారీగా కేటాయింపులు పూర్తయ్యాయి. విత్తన సేకరణకు అధికారులు సమయత్తమయ్యారు.

విత్తన సేకరణకు సీడ్ మానిటరింగు సెల్

సార్వత్రిక ఎన్నికల విధుల్లోనున్న అధికార యంత్రాంగం ఇప్పుడు విత్తన సేకరణపై దృష్టి సారించింది. తక్కువ సమయం కావడంతో విత్తన సేకరణ వేగవంతం చేయడంపై దృష్టి సారించారు. గత ఏడాది సేకరణలో కొంత సమస్య తలెత్తి పంపిణీలోనూ జాప్యం జరిగింది. ఈసారి అలా కాకుండా ఉండే విధంగా ముందస్తు చర్యలు తీసుకునేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. ఇందుకోసం సీడ్ మానటరింగు సెల్‌ను జిల్లా కలెక్టరు వినోద్ కుమార్ ఏర్పాటు చేశారు. విత్తన సేకరణ, నాణ్యతను ఆయన శుక్రవారం స్వయంగా పరిశీలించారు.

అభివృద్ధి పనులకు ఆటంకం

ఎన్నికల కోడ్‌తో పడకేసిన అభివృద్ధి
ముందుకుసాగని వ్యవసాయం, విద్య, ఇతర అభివృద్ధి పనులు
ఇబ్బందుల్లో ఉమ్మడి జిల్లా ప్రజలు



పుట్లూరు మండలంలో తాగునీటి సమస్యపై సచివాలయాన్ని ముట్టడించిన మహిళలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత రెండు నెలలుగా ఎన్నికల వేడి నెలకొంది. ఎక్కడ చూసిన రాజకీయ వాతావరణమే కన్పించింది. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రతి అంశం రాజకీయం చుట్టూనే తిరిగింది. అన్ని శాఖల అధికారులు ఎన్నికల పనుల్లోనే బిజీ అయ్యారు. ఈ నెల 13వ తేదీన ఎన్నికల పోలింగ్ ముగిసేంత వరకు అధికారులు ఆ పనుల్లోనే నిమగ్నం అయ్యారు. జూన్ 4వ తేదీన ఫలితతాలు వెల్లడయ్యే వరకు ఇంకా ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. ఈ పరిస్థితుల్లో సాధారణ సమస్యల పరిష్కారం, ఇతర అభివృద్ధి పనులకు ఆటంకం నెలకొంది.

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్నికల ప్రవర్తనా నియమావళి నేపథ్యంలో ప్రజా సమస్యలు సైతంపరిష్కరించలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర పనులకు సైతం ఎన్నికల నుంచి అనుమతి తీసుకోవల్సిన ఉండడంతో అభివృద్ధి పనులు ప్రారంభించలేని పరిస్థితి ఉంది. ఎన్నికల ఫలితాల తర్వాత బదిలీలు ఉంటాయనే ప్రచారం నేపథ్యంలో అధికారులు ఆయా మండలాల్లో ప్రజాసమస్యల పరిష్కారానికి ముందుకు రావడం లేదు. అధికారులంతా కేవలం ఎన్నికల పనులకే ప్రాధాన్యతను ఇస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయం, విద్య, గ్రామాల్లో స్థానిక సమస్యల పరిష్కారానికి ఎన్నికల కోడ్ అవాంతరంగా మారింది. సమస్యల పరిష్కారం కోసం తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలకు ప్రజలు వెళ్తే తాము ఎన్నికల విధుల్లో ఉన్నామనే మాట అధికారుల నుంచి వ్యక్తం అవుతోంది.

వన్-బి కష్టాలు

ప్రస్తుతం పంట రుణాల రెన్యూవల్ పనులు కొనసాగుతున్నాయి. ఆయా బ్యాంకుల్లో రుణాల రెన్యూవల్‌కు సంబంధించి రైతులు వెళు న్నారు. అయితే ఈ ఏడాది రైతులకు కొత్త కష్టం వచ్చి పడింది. ఇటీవల ప్రభుత్వం చేసిన భూ రీ సర్వే కారణంగా చాలా గ్రామాల్లో రైతులకు సంబంధించి వన్-బి వివరాలు ఆన్‌లైన్‌లో కన్పించడం లేదు. దీంతో రైతులు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. వన్-బి వివరాలను సరి చేసి ఆన్‌లైన్‌లో ఉంచాలని కోరుతూ అన్ని మండలాల్లోనూ రైతులు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తాము ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న పొలాలకు సంబంధించి వన్-బి వివరాలు ఆన్‌లైన్‌లో లేవని, దీని వల్ల బ్యాంకర్లు పంట రుణాల రెన్యూవల్ చేసుకోవడం లేదని, తక్షణం ఈ సమస్యను పరిష్కరించాలని అధికారుల వద్ద మొర పెట్టుకున్నారు. కాగా ప్రస్తుతం ఆయా తహశీల్దార్ కార్యాలయాలకు ఎన్నికల విధుల నిమిత్తం వచ్చిన అధికారులు విధుల్లో ఉన్నారు. ఈ అధికారులు ఈ సమస్యలపై పూర్తి స్థాయిలో స్పందించడం లేదు. ఈ సమస్యను ముట్టుకుంటే ఆ తర్వాత తమకేమి ఇబ్బందులు వస్తాయన్న భావంతో అన్నింటికీ ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపుతున్నారు. రైతుల మాత్రం తక్షణం వన్-బి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఖరీఫ్ సీజన్ ప్రారంభం

మరో పది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడ వర్షాలు పడ్డాయి. ఈ వారంలో వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు ఇప్పటికే తెలియజేశారు. ఈ నేపథ్యంలో రైతన్నలు సాగుకు సమాయాత్తం అవుతున్నారు. ఈ వారంలో వర్షాలు పడితే పొలంలో దుక్కుల పనులు ప్రారంభం అవుతాయి. ఇక ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో రైతులు వేరుశనగ పంటలను సాగు చేస్తారు. ఈ పంటకు సంబంధించి ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తుంది. ఈ సబ్సిడీ విత్తనాలు తీసుకునే ఎక్కువ మంది రైతులు పంటలు సాగు చేసే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో రైతులకు సరపరా విత్తన సరఫరా, ఎరువుల సరఫరా చేయాల్సుంది.

స్పందన గ్రీవెన్స్ లేదు..!

కలెక్టరేట్, మండల కేంద్రం, ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన గ్రీవెన్స్ కార్యక్రమం ఎన్నికల కోడ్ కారణంగా రద్దు అయ్యింది. గత ఐదు వారాలుగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహించలేదు. ఈ కార్యక్రమం ఉంటే వ్యక్తిగత, గ్రామ సమస్యలపై ప్రజలు అర్జీల రూపంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించమని కోరేవారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రస్తుతం ఈ పరిస్థితి లేదు. గ్రీవెన్స్‌ను పునరుద్ధరిస్తే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

తాగునీటి సమస్యలు

వేసవి కాలం ప్రారంభం నుంచి ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉంది. ఎన్నికల కోడ్ ఉన్నా తాగునీటి సమస్య పరిష్కారంపై మాత్రం అధికారులు సమీక్షలు నిర్వహించి ఆ సమస్యకు పరిష్కారం చూపేలా ఆదేశాలు జారీ చేశారు. అయితే అధికారులందరూ ఎన్నికల విధుల్లో ఉన్న కారణంగా ఈ సమస్యలకు పూర్తి స్థాయిలో పరిష్కారం చూపలేక పోయారు. పూర్తి స్థాయిలో నిధులు మంజూరు అయితేనే ఆయా గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి ఇందుకు సంబంధించి నిధులు మంజూరు కావాలన్నా ఎన్నికల కోడ్ ముగియాల్సి ఉంది.

కొత్త విద్యా సంవత్సరం మొదలు

మరో 25 రోజుల్లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. పాఠశాలలకు సంబంధించి జూన్ 12వ తేదీ నాటికి వేసవి సెలవులు ముగిస్తాయి. అప్పటి నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేలోగా అక్కడ మౌలిక వసతులను కల్పించాల్సిన బాధ్యత సంబంధిత విద్యాశాఖ అధికారులపై ఉంది. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో పాఠశాలలను ఎన్నికల పోలింగ్‌కు నిమిత్తం తీసుకున్నారు. దీంతో పాఠశాలల్లో ఎలాంటి అభివృద్ధి పనులు సాగలేదు. జూన్ 4వ తేదీ వరకు ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ఇప్పుడు కూడా అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యే అవకాశం కన్పించలేదు. పాఠశాలల్లో కనీసం మరమ్మతు పనులు చేసేందుకు సైతం వీలు ఉండని పరిస్థితులు ఈ ఏడాది కన్పిస్తున్నాయి.

తాడిపత్రి ఘటనపై విచారణకు వైసిపి డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్నికల పోలింగ్ రోజు, తర్వాత రోజు జిల్లాలోని తాడిపత్రి నియోజకవర్గంలో జరిగిన ఘటనలపై నిస్పక్షపాతంగా, లోతైన విచారణ చేయాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులు అనంత వెంకటరామిరెడ్డి, వై.విశ్వేశ్వరరెడ్డి, ఎం.వీరాంజనే యులు డిమాండ్ చేశారు .శుక్రవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ఆదేశాలను ఎన్నికల కమిషన్ తూచా తప్పకుండా అమలు చేసిందన్నారు. ఇందులో భాగంగానే ఎన్నికలకు ముందే ఎస్పీ, డీఎస్పీలను బదిలీ చేసిందన్నారు. తాడిపత్రిలో ఎస్పీ పర్యవేక్షణలోనే ఎన్నికలు జరిగాయన్నారు. పక్కా ప్రణాళికతోనే ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటిపై, కుటుంబ సభ్యులపై దాడి జరిగిందన్నారు. దాడులను నివారించడంలో పోలీసులు పూర్తిగా విఫలమ య్యారన్నారు. టిడిపి అధినేతతోపాటు కూటమి నేతలు అడ్డదారిలో గెలవాలని ప్రయత్నించార న్నారు. ఇందులో భాగంగానే డిఐజిని, ఎస్పీని బదిలీ చేయించారన్నారు. ఉరవకొండలో టిడిపి అభ్యర్థి కేశకే నిందితులను ఏజెంట్లుగా నియమించుకున్నా ఎన్నికల కమిషన్ అడ్డు చెప్పలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాడిపత్రి ఘటనలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు తగిన ఏర్పాట్లు : కలెక్టర్



విడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, డిఆర్ఒ, తదితరులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఓట్ల లెక్కింపునకు తగిన ఏర్పాట్లు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. శుక్రవారం ఏపీ సచివాలయం నుంచి సాధారణ ఎన్నికలు కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలు, వివి ప్యాడ్‌ల సురక్షిత నిల్వ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ లో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తో పాటు ఎస్పీ పి. మాధవరెడ్డి, డిఆర్ఒ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంలను స్ట్రాంగ్ రూములలో భద్రపరిచామన్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ హిందూపురం సమీపంలోని మణుగూరు వద్ద గల బిట్స్ కళాశాలలోను లేపాక్షి సమీపంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల లోను మూడంచెల భద్రత తో పటిష్టమైన బందోబస్తు చేపట్టామన్నారు. జూన్ 4న జరిగే కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లతో పాటు తగిన మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. అకౌంటింగ్ సక్రమంగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

కురిసింది వాన..

ప్రజాశక్తి - అనంతపురం

నైరుతి రుతు పవనాల ప్రభావంతో శుక్రవారం ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలు చోట్ల వర్షాలు పడ్డాయి. ఓ మోస్తరు నుంచి ఉరుములతో కూడిన వర్షాలు కురిసాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని బొమ్మనహాల్, మడకశిర, కదిరి ప్రాంతాలతో పాటు అనంతపురం నగర చుట్టుపక్కల మండల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. బొమ్మనహాల్ మండలంలో కురిసిన వర్షాలకు రైతులకు తీరని నష్టం వాటిల్లింది. రబీలో బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ కోత దశకు వచ్చింది. పంటనూర్పిడి చేసి రైతుల వేరుశనగ ఈ వర్షానికి తడిచిపోయాయి. వరిపంట నేలవాలింది. గాలికి బత్తాయి, దానిమ్మ, అంజూర కాయలు నేలరాలాయని రైతులు వాపోయారు. ఇక మడకశిరలో భారీవర్షానికి పట్టణం జలమయమైంది. వాగులు, వంకలు పొంగిపోర్లాయి. కదిరి పట్టణంలో భారీ వర్షం కురిసింది. ఎండవేడిమికి, ఉక్కపోతకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఉమ్మడి జిల్లా ప్రజలకు శుక్రవారం కురిసిన వర్షం కాస్త ఉపశమనాన్ని ఇచ్చింది. వర్షం రాకతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తొలిదుక్కులు చేసుకోవచ్చని అంటున్నారు



మడకశిర మండలంలోని జమ్మనపల్లిలో ప్రవహిస్తున్న వాగు



కదిరిలో కురిసిన వర్షానికి జలమయమైన రోడ్డు

ఆగని వసూల్‌రాజా ఆగడాలు

నోటీసుల పేరుతో బెదిరింపులు
చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు



కదిరి మున్సిపల్ కార్యాలయం



ప్రజాశక్తి - కదిరిటౌన్

కదిరి మున్సిపాలిటీలో అవినీతి రోజురోజుకు రాజ్యమేలుతోంది. మున్సిపాలిటీలోని ఓ వసూళ్ల రాజా ఆగడాలు హద్దే లేకుండా పోతోంది. వసూళ్ల పర్వానికి ఒక్కోసారి ఒక్కో మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. సెలవు కావాలన్నా , కార్మికుల బీమా చెల్లించాలన్న, ప్రొహబిషన్ డిక్లరేషన్ అయినా ఆయనకు మామూళ్లుముట్ట చెప్పాల్సిందే. గతంలో ఈయనగారి అవినీతి భాగోతాన్ని ప్రజాశక్తి బట్టబయలు చేస్తే ఉన్నతాధికారుల హెచ్చరికలతో కార్మికుల నుంచి తీసుకున్న సొమ్మును ముట్టజెప్పాడు. రోజులు తన అవినీతి పర్వానికి కామా పెట్టాడు. 'కుక్కతోక వంకర ' అన్న చందంగా తిరిగి ఆ అధికారి తమ అవినీతి భాగోతానికి తెరలేపినట్లు తెలుస్తోంది. తాజాగా మరో రకం ఎత్తుగడకు తెరలేపాడు. మున్సిపల్ పరిధిలోని ఓ సచివాలయంలో పనిచేసే మహిళ చిరుద్యోగి తన కొడుకుకు పక్క జిల్లాలో పరీక్ష రాయించేందుకు గాను మున్సిపల్ కమిషనర్‌ని ఒకరోజు సెలవు అడిగినట్లు సమాచారం. ఎన్నికలు వేళ సెలవు మంజూరు చేయడం కుదరదని మున్సిపల్ ఉన్నతాధికారి చెప్పాడు. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో తన కుమారుడి పరీక్ష హాజరు నిమిత్తం కొడుకును వెంట పెట్టుకొని ఆ చిరుద్యోగి పక్కజిల్లాకు వెళ్లివచ్చింది. అది గుర్తించిన అధికారులు విచారణ పేరుతో చిరుద్యోగికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీంతో ఆ ఉద్యోగి తన సమస్యను ఉన్నతాధికారికి విన్నవించి తనపై చర్యలు తీసుకోవద్దని బతిమలాడింది. సరిగ్గా ఈ సమయంలోనే వసూల్‌రాజా రంగప్రవేశం చేశాడు. ఆ ఉద్యోగిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా వసూళ్ల పర్వానికి తెరలేపాడు. దీంతో ఆ ఉద్యోగి చేసిది లేక రూ.4వేలు ఇవ్వడానికి సిద్ధమవ్వగా వసూల్‌రాజా రూ. 10వేలు ఇవ్వాల్సిందేనని పట్టుపట్టినట్లు విశ్వసనీయ సమాచారం. వసూల్‌రాజా అవినీతి భాగోతానికి ఇది కేవలం శాంపిల్‌మాత్రమే. ఇలా పలురకాలైన వాటిపై వసూల్‌రాజా కన్నేసి తన వసూళ్లదందాను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. వసూల్‌రాజాపై ఇన్ని ఆరోపణలు వస్తున్నా సంబంధిత ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా కనీసం ఈ ఆరోపణలపై స్పందించిన దాఖలాలు కూడా లేవు. దీంతో వారి తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబందిత ఉన్నతాధికారులు స్పందించి వసూల్‌రాజా భాగోతంపై విచారణ జరిపి మున్సిపాలిటీలో తిష్టవేసిన అవినీతి కుంపటిని తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పోలింగ్ రోజు జరిగిన ఘర్షణలో 38 మందిపై కేసు

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఈ నెల 13 సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ల్‌రోజు చిలమత్తూరు మండలంలో హింసకు పాల్పడి అల్లర్లు సృష్టించిన 38 మంది పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. ఈ మేరకు పోలింగ్ రోజు వీరాపురం పంచాయతీ లోని హుస్సేన్‌పురం గ్రామంలో వైసిపి, టిడిపి వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటనలో వైసిపికి చెందిన నవీన్ కుమార్, టిడిపికి చెందిన బాబురెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో మండలం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఘటన అనంతరం టిడిపికి చెందిన 19 మందిపై వైసిపి ఎంపిపి పురుషోత్తమ రెడ్డి ఫిర్యాదు చేశారు.అలాగే టిడిపికి చెందిన బాబు రెడ్డి 19 మందిపై ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఉన్నత అదికారుల సూచన మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ గంగాధర్ తెలిపారు.

అంతా కల్తీమయం..!



నూతన మార్కెట్ ఎదురుగా ఉన్న షాపులో లూజ్ పామాయిల్ విక్రయిస్తున్న వ్యాపారి

"కాదేదీ కల్తీకి అనర్హం' అన్నట్లు జిల్లాలో కారం నుంచి నెయ్యి వరకూ ప్రతీది కల్తీమయం చేస్తున్నారు. తయారీదారులు వినియోగదారుల ఆరోగ్యాలను విస్మరించి కల్తీ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యావసరాలు మొదలుకొని ప్రతి వస్తువులోకి కల్తీలను చేరుస్తున్నారు. నూనె, నెయ్యి, శనగపిండి, తదితర వాటితో పాటు చివరికి ధనియాలు, బఠాణీలు వంటి వాటిని కూడా వదలడం లేదు. హిందూపురంలోని 'వ్యాపారులకు పండగ'. వినియోగదారులకు అనారోగ్యం'గా కల్తీల వ్యవహారం జోరుగా సాగుతోంది. ఒకరకంగా చెప్పాలంటే కల్తీ కేంద్రాలు కుటీర పరిశ్రమలుగా వెలిశాయి. అరికట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో కాలం వెళ్లదీస్తున్నారు."

కారం నుంచి నెయ్యి వరకూ..
అడ్డదారి తొక్కుతున్న తయారీదారులు
చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



ఆరుబయట మిక్సర్ తయారీ



చిప్స్ తయారీకి ఉపయోగిస్తున్న నాసిరకం ఉర్లగడ్డలు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రస్తుతం మార్కెట్లో నిత్యావసరాలు.. నూనెలు, నెయ్యి, తదితర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఏది కొనాలన్నా భారంగానే ఉంది. ఇదే అదనుగా కల్తీ వ్యాపారులు విజృంభిస్తున్నారు. ఆయా వస్తువులను కల్తీ చేస్తూ లాభాలు గడిస్తున్నారు. గతంలో అధికారులు తరచూ తనిఖీలు చేస్తుండేవారు. దీంతో ఎక్కడో ఓ దగ్గర మాత్రమే కల్తీలు జరుగుతుండేవి. అయితే ఇప్పుడు తనిఖీలు జరగడం లేదు.. ఒకవేళ ఎవరైనా వచ్చినా వారికి ఎంతో కొంత సమర్పించి కేసులు లేకుండా చూసుకుంటున్నారు. దీంతో కల్తీలు రోజురోజుకు అధికమవుతున్నాయి. కల్తీల దెబ్బకు ఇంట్లో తయారు చేసుకునే పదార్థాల వల్ల కూడా పట్టణ ప్రజలు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉంది. పండుగల సమయంలో కల్తీలు మరింత తీవ్రం అవుతున్నాయి. కల్తీలు ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నా.. వ్యాపారులకు పట్టడంలేదు. పాలు, నెయ్యి, నూనెల కల్తీలతో కేన్సర్, తదితర తీవ్రమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.

కల్తీ ఆవ నూనె వల్ల ఇటీవల ఢిల్లీలో 33 మంది డ్రాప్సీకా అనే కాలేయ సంబంధిత వ్యాధి బారిన పడ్డారు. వంటనూనె, నెయ్యి, కొబ్బరినూనె వంటి వాటిని ప్యాకింగ్, ముద్రణ వివరాలు లేకుండా విక్రయించకూడదన్న నిబంధన ఉంది. వీటి లూజు విక్రయాలపై పూర్తి నిషేధం ఉంది. అయితే జిల్లాలో మాత్రం లూజు విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పండుగల సమయంలో నెయ్యి, వంటనూనె వాడకం అధికంగా ఉంటుంది. కేజీ నెయ్యి రూ. 800 వరకూ ఉండటంతో కల్తీల దృష్టి నెయ్యిపై పడింది. పిండి వంటల్లో వాడే బెల్లంలో 90 శాతం కల్తీనే ఉంటుంది. జిల్లాలో కల్తీదారులపై తనిఖీలు, దాడులు చేసేందుకు ఆహార భద్రతా విభాగానికి తగినంత మంది సిబ్బంది లేరు. నిబంధనల ప్రకారం అర్బన్ పరిధిలో ప్రతి 50 వేల మందికి, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి లక్ష మందికి ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉండాలి. ఈ లెక్క ప్రకారం జిల్లాకు 50 మందికి పైగా సిబ్బంది ఉండాలి. కానీ జిల్లాలో నలుగురు మాత్రమే ఉన్నారు.

పిండి వంటల్లోనూ కల్తీలు

ప్రస్తుతం ఎక్కువమంది సంప్రదాయ వంటలను స్వీట్ల దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. పిండి వంటల తయారీలో ఎక్కువశాతం కల్తీ నూనె, నెయ్యినే వాడుతున్నారు. వీటి విక్రయాలు ఇటీవల అధికమయ్యాయి. చిరు వ్యాపారులు రోడ్లపై బళ్లు పెట్టుకుని అరిసెలు, ఇతర పిండి వంటలు విక్రయిస్తున్నారు. వీటి నాణ్యతా ప్రమాణాలను అంచనా వేయడం, అరికట్టడం అధికారులకు సమస్యగా మారింది. సవరించిన ఆహార భద్రతా ప్రమాణాల చట్ట ప్రకారం అమ్మకానికి ఉంచిన స్వీట్లపై తయారీ వివరాలను ముద్రించాలి. అయితే జిల్లాలో ఏ ఒక్క వ్యాపారి పిండి వంటలపై వివరాలను ముద్రించడం లేదు.

ఫిర్యాదు చేసుకునే అవకాశం

సవరించిన చట్టం ప్రకారం స్వీట్లు, పిండి వంటలు పాడైతే కూడా ఫిర్యాదు చేసుకోవచ్చు. గతంలో ఇటువంటి నేరాలకు పాల్పడిన వారికి జరిమానాలతో సరిపెట్టేవారు. 2019 సవరించిన చట్టప్రకారం రుచిగా లేని, గడువుతీరిన పాడైపోయే వాటిని అమ్మితే రూ. 5 లక్షల జరిమానా, ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ సవరణలు చేసింది. పదార్థాలు కొనుగోలు చేసినప్పుడు రశీదు తీసుకుంటే ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉంటుంది.

కల్తీ ఇలా...

గోధుమ పిండిలో మైదా, శనగపిండిలో బఠాణీ పిండి కలుపుతున్నారు. పిప్పరకుసుమ గింజలు కలిసిన ఆవనూనెను వంటల్లో వాడుతున్నారు. నెయ్యిలో ఆవు ఎముకల నుంచి తీసిన తేటను కలుపుతున్నారు. బరువు కోసం బంగాళ దుంపలను ఉడికించిన నీటిలో కలుపుతున్నారు. స్వచ్ఛమైన నెయ్యి చలికాలంలో గడ్డ కడుతుంది. కానీ మార్కెట్లో లభించే నెయ్యిలో ఇటువంటి గుణం కనిపించడం లేదు. కందిపప్పులో కేసరిపప్పు అనే పదార్థాన్ని కలుపుతున్నారు. ఇది తినడం వల్ల నాడీ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అరిసెలు, ఇతర స్వీట్లు తయారీ సమయంలో వాటి రంగు మరింత ఆకర్షణీయంగా కనబడటానికి మెటానిల్ అనే కెమికల్ వాడుతుంటారు. ఇవి కలిసిన పదార్థాలు తినడం వల్ల జీర్ణవ్యవస్థ పూర్తిగా దెబ్బతిని క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది.

ఫుడ్‌లైసెన్స్ నెంబర్ ముద్రించాలి

ఆహార సంబంధిత వ్యాపారాలు నిర్వహించే వారు నిబంధనల ప్రకారం బిల్లులు, టాక్స్ ఇన్వాయిస్‌పై ఫుడ్‌లైసెన్స్ నెంబర్‌ను తప్పని సరిగా ముద్రించాలి. స్వీట్ల తయారీదారులు వాటిపై తయారీ వివరాలను ముద్రించాలి. నిబంధనలు పాటించని వారిపై కేసులతో పాటు రూ. 2 లక్షల వరకూ జరిమానా విధించే అధికారం ఉంది. ఇక లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసే వారికి 6 నెలల జైలు శిక్షతో పాటు, రూ. 5 లక్షల వరకు జరిమానా విధించాల్సి ఉంది. ఆహార పదార్థాల తయారీ, విక్రయాల వార్షిక టర్నోవర్‌ను మే 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో ఢిల్లీకు పంపాల్సి ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల వ్యాపారులు ఇందులో ఒక్క నిబంధనా పాటించడం లేదు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు : సిఐ

పుట్టపర్తి క్రైమ్ : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా, ఏ పార్టీ వారైనా, ఎంతటి వారైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ కొండారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఎవరూ శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా ప్రవర్తించరాదన్నారు. గొడవలకు ప్రోత్సహించినా, సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు చేసినా కఠిన చర్యలతో పాటు రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల దృష్ట్యా పట్టణంలో 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉన్నాయని, ఎక్కడా గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు నిషేధమన్నారు. ఎక్కడ గొడవలకు, ఘర్షణలకు అవకాశం ఇవ్వకుండా ప్రతి ఒక్కరూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలన్నారు. ఎక్కడైనా అల్లర్లు, ఘర్షణలు జరిగే అవకాశం ఉన్నా, జరిగిన తర్వాత అయినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఎపిటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.హరిప్రసాద్‌రెడ్డి, కె.సురేంద్ర

కదిరి టౌన్ : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఎపిటిఎఫ్) సత్యసాయి జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జిల్లా గౌరవాధ్యక్షులు నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఎపిటిఎఫ్ జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పివి ప్రసాద్, ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఇసి సభ్యులు వెంకటరెడ్డి వ్యవహరించారు. రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కమిటీ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బడా హరిప్రసాద్‌రెడ్డి, కాలువ సురేంద్రను రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే అసోసియేట్ అధ్యక్షుడిగా కె.నర్సిరెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శిగా పి.వెంకటేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులుగా బి.బాబాఫకృద్దీన్, పి.మహేశ్వర్‌రెడ్డి, పక్కీరప్ప, కె.గోపాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శులుగా జి.శ్రీనివాసులు, కె.శ్రీనివాసులు, బి.వెంకటరామిరెడ్డి, నారాయణస్వామి, భాస్కర్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

మడకశిరలో భారీ వర్షం..

మడకశిర : మండల వ్యాప్తంగా శుక్రవారం భారీ వర్షం కురిసింది. అధిక ఉష్ణోగ్రతలు, తీవ్ర ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో పట్టణంలో మధ్యాహ్నం 4 గంటల నుంచి వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి పట్టణ ప్రజలు కొంతవరకూ ఉపశమనం పొందారు. మడకశిర పట్టణంలో ఒక్కసారిగా భారీగా వర్షం కురవడంతో పట్టణమంతా జలమయమైంది. గ్రామీణ ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చాలా గ్రామాల్లో కుంటల్లోకి వర్షం నీరు చేరాయి. ఇంతవరకు రైతులు ఎలాంటి పొలం పనులు చేపట్టలేదు. ఈ వర్షానికి రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ ముంగారు సేద్యానికి సిద్ధమవుతున్నారు. మండలంలోని జమ్మనపల్లి, తురకవాండ్లపల్లి, మరువపల్లి, గౌడనహళ్లి, అమిదాలగొంది, చందకచెర్ల, తదితర గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం : షహీద్ టిప్పు సుల్తాన్ ఉత్తమ విద్యా ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ఇండియా టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అండ్ ముస్లిం నగారా వ్యవస్థాపక అధ్యక్షులు కల్లూరు మొహమ్మద్ ఉమర్ ఫారూఖ్ ఖాన్ తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ హిందూపురం పట్టణం, రూరల్ మండల పరిధిలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్, నీట్, జేఈఈలో అత్యంత ప్రతిభ కనబర్చిన వారికి ఈ పురస్కారం అందజస్తామన్నారు. పదో తరగతిలో 500, ఇంటర్‌లో 850పై చిలుకు మార్కులు సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్ మార్కుల జాబితాతో పాటు కుల ధ్రువీకరణ పత్రాలతో ఉబేదుల్లా హుసేన్ ముస్లిం మైనారిటీ డెవలప్‌మెంట్ సంస్థ అధ్యక్షులు వాట్సప్ నెంబరు 85559 26984కు ఈ నెల 25లోగా దరఖాస్తు పంపాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రతిభా పురస్కారం అందిస్తామన్నారు.

విత్తన వేరుశనగ అందించి రైతులను ఆదుకోండి

మడకశిర : నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధాన పంటగా సాగు చేసే వేరుశనగ పంటకు విత్తన వేరుశనగను అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రధానంగా నియోజకవర్గంలోని రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాల్లోని రైతులు వేరుశనగ పంటను సాగు చేసి జీవనం సాగిస్తున్నారు. గత ఏడాది వేరుశనగ పంట పూర్తిగా నష్ట పోవడంతో రైతుల దగ్గర విత్తన వేరుశనగ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిసారి రైతులు ఏదోవిధంగా నష్టపోతూనే ఉన్నారు. అతివృష్టి, అనవృష్టి వల్ల రైతులు నష్టపోవడంతో ఏ ఒక్క రైతు వద్ద చిల్లి గవ్వ లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వేరుశనగ కొనుగోలుకు రైతుల దగ్గర డబ్బులు లేకపోవడంతో ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సబ్సిడీతో రైతులకు విత్తన వేరుశనగను అందించాలని నియోజకవర్గ రైతులు డిమాండ్ చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మండలంలోనూ శుక్రవారం వర్షం కురవడంతో రైతులు దుక్కి దున్ని పనులు చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. వెంటనే ప్రభుత్వం సబ్సిడీతో వేరుశనగను సరఫరా చేస్తే కొంతవరకూ ఉపశమనం కలుగుతుందని రైతులు పేర్కొంటున్నారు.

నిధులున్నా ముందుకుసాగని నాడు-నేడు పనులు

కెజిబివిలో గోడలకే పరిమితమైన అదనపు తరగతి గదులు



గోడల స్థాయిలో నిలిచిపోయిన అదనపు తరగతి గదులు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయ(కెజిబివి)కు నాడు-నేడు కింద రెండవ దశలలో అదనపు గదుల నిర్మాణం, మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. అయితే అదనపు తరగతి గదుల పనులు గోడలకే పరిమితమయ్యాయి. జూన్ 12వ తేదీ పాఠశాలలు పున:ప్రారంభం అవుతున్న తరుణంలో కెజిబివిలో అదనపు తరగతి గదులు అవసరం అవుతాయి. నిధులున్నా కూడా పనులు ముందుకు సాగకపోవడంపై సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి నాడు-నేడు పనులు త్వరగా చేసి విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా అదుపు తరగతి గదులను పూర్తి చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. స్కూల్ కమిటీ ఛైర్మన్, ప్రిన్సిపల్ నిర్లక్ష్యం వల్లే ఆయా పనులు సకాలంలో పూర్తి చేయడంలేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల ఫలితాలపైనే సర్వత్రా చర్చ

10 గ్రామాల్లో 90శాతం పైచిలుకు పోలింగ్.. నల్లచెరువులో పెరిగిన ఓటింగ్ ఎవరికి లాభించేనో?



ప్రజాశక్తి-నల్లచెరువు

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13వ తేదీ జరిగిన పోలింగ్‌లో మండల వ్యాప్తంగా 81 శాతం ఓట్లు పోలైనట్లు అధికారుల లెక్కల ద్వారా తెలుస్తోంది. మండలంలో మొత్తం 25,017 ఓట్లు ఉన్నట్లు అధికారుల గణాంకాలు పేర్కొన్నాయి. అయితే ఇక్కడ వైసిపి ప్రభుత్వం 'నవరత్నాలు' పేరుతో అమలు చేసిన పథకాలు లేదా టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన 'సూపర్‌సిక్స్' పథకాలు ఏమాత్రం పని చేశాయో తెలియాలంటే మాత్రం జూన్ 4వ తేదీ వరకూ వేచి చూడాల్సిందే. మండల కేంద్రంలో బస్టాండ్, హోటళ్లు, టీ స్టాల్స్‌తో పాటు గ్రామాల్లో ఏ నలుగురు కలిసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చ సాగుతోంది. మండల వ్యాప్తంగా మొత్తం 22,077 ఓట్లు పోలవగా అందులో మహిళా ఓటర్లు 11,031 మంది, పురుషులు 11,046 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలోని 10 గ్రామాల్లో 90 శాతం పోలింగ్ నమోదవడం గమనార్హం. 90శాతం పోలైన గ్రామాలు కమ్మవారిపల్లి, ఎర్రగుంటపల్లి, పోలేవాండ్లపల్లి, మల్‌రెడ్డిపల్లి, పంతులుచెరువు, కె.పూలకుంట, పెద్దఎల్లంపల్లి, బొమ్మిరెడ్డిపల్లి, మారిశెట్టిపల్లి తదితర గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, టిడిపి ముఖ్యనాయకులు బూత్‌ల వారీగా లెక్కలు వేసి ఎమ్మెల్యే అభ్యర్థుల వద్దకు వెళ్లి వివరించి ఎవరికి వారు మండలంలో తమకే మంచి మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు మాత్రం మండలంలో ఏ పార్టీకి మెజారిటీ వస్తుందో, ఎవరు ఎమ్మెల్యే, ఎంపిగా గెలుస్తారలో అని ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపు జరుగుతుండడంతో ఎక్కువమంది దానిపై ఎక్కువ దృష్టి పెట్టారు. కొందరు మెజారిటీ, గెలుపుపై బెట్టింగ్ కూడా కాస్తున్నారు. మరోవైపు మండలంలో ఇంకా 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉన్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు మసలుకోవాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. మండంలో ఏ పార్టీకి మెజారిటీ వస్తుందో, ఎమ్మెల్యే, ఎంపిలుగా ఎవరు గెలుస్తారో తెలియాలంటే మాత్రం జూన్ 4వ తేదీ వరకూ ఆగాల్సిందే.

టింబక్టివ్ కలెక్టివ్ ఆధ్వర్యంలో చెరువు పనులు



మాట్లాడుతున్న టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ సహ వ్యవస్థాపకులు మేరీ

ప్రజాశక్తి-రొద్దం

టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కోగిర గ్రామానికి చెందిన చెరువులో పూడికతీత, చెరువు కట్ట మరమ్మతులు చేపట్టారు. ముఖ్య అతిథులుగా టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ సహ వ్యవస్థాపకులు మేరీ వట్టమట్టం, వాటర్ రాయలసీమ ప్రాజెక్ట్ మేనేజర్ పేరూరి శ్రీకాంత్ హాజరై మాట్లాడారు. టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ 34 ఏళ నుంచి మహిళలు, రైతులు, వికలాంగులు, పిల్లలు, పర్యావరణం, వ్యవసాయ కూలీలు, కళాకారులతో కలిసి పని చేస్తుందని తెలిపారు. పర్యావరణంలో భాగంగా ఉమ్మడి భూముల సంరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అలాగే గ్రామ ఉమ్మడి వనరులైన నీటి వనరుల మరమ్మతులు, పూడికతీత పనులు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా రొద్దం, చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాల్లోని 12పంచాయతీలు, 16 గ్రామాల్లో రాయలసీమలో వాటర్ ప్రాజెక్ట్ కార్యక్రమం ద్వారా చేపట్టామన్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం రొద్దం మండలంలోని కోగిర, శ్యాపురం, కంబాలపల్లి, బీదానపల్లి, రాచూరు, దొడఘట్ట, చెరుకూరు, రొద్దంలో చెరువులో పూడికతీత, కట్ట మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు తెలపారు. ఇందులో భాగంగా కోగిర గ్రామ చెరువులో పూడికతీత కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోగిర సర్పంచ్ రామకృష్ణ, ఇతర కార్యక్రమాల మేనేజర్లు మహేష్, రమేష్, సుకన్య, కోఆర్డినేటర్లు, కార్యకర్తలు, కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్స్, కల్పవల్లి సొసైటీ అధ్యక్షులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని రైతుల ధర్నా



విద్యుత్ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రైతులు స్థానిక విద్యుత్ కేంద్రం వద్ద ధర్నా చేపట్టారు. మండలంలోని పొడరాళ్లపల్లి, ఆర్‌ఎస్.తండా, పూజారితండా, మంగళమడక గ్రామాల రైతులు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ విద్యుత్ కేంద్రం ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ గతంలో విద్యుత్ శాఖ అధికారులను కలిసి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని, లేనిచో చేతికొచ్చిన పంటలు తీవ్రంగా నష్టపోతామని మొరపెట్టుకోగా స్పందించిన అధికారులు ప్రత్యామ్నా యంగా మారాల విద్యుత్ కేంద్రం నుంచి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేశారన్నారు. అలాంటిది ఇప్పుడు మారాల విద్యుత్ కేంద్రం సరఫరాను నిలిపివేసి ముదిగుబ్బ విద్యుత్ కేంద్రం నుంచి సరఫరా చేస్తున్నారని, దీంతో నాణ్యమైన విద్యుత్ అందకపోవడంతో సమయానికి నీరందించకపోవడంతో సాగు చేసిన పంటలు నష్టపోతున్నామని వాపోయారు. ఇకనైనా విద్యుత్ అధికారులు స్పందించి నాణ్యమైన విద్యుత్‌ను అందించి చేతికొచ్చిన పంటను కాపాడాలని రైతులు కోరారు.

మత్స్య శాఖ అధికారులతో కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి కథనానికి స్పందన



మత్స్య శాఖ అధికారులతో సమీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘం పరిధిలో ఉన్న కొట్నూరు చెరువులో మత్స్య సంపదపై ఆ శాఖ అధికారులతో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి సమీక్షించారు. 4 రోజుల క్రితం కొట్నూరు చెరువులో చేపలను ఆ వార్డు కౌన్సిలర్ అక్రమంగా పట్టి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈమ అంశంపై ప్రజాశక్తిలో 'మత్స్య సంపద దోపిడీ' శీర్షికతో కథనం వచ్చింది. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మత్స్య శాఖ అధికారులతో దీనిపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా గతంలో బహిరంగ వేలం ఎప్పుడు వేశారు, వేలంలో చెరువును ఎవరు దక్కించుకున్నారు తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే బహిరంగ వేలం వేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఈ విషయంపై మత్స్యశాఖ అధికారి శంకరయ్య మాట్లాడుతూ ఇప్పటికే కొట్నూరు చెరువులో చేపలు పడుతున్న వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు. నోటీసులు తీసుకున్న అనంతరం చేపలు పడితే వారిపై పోలీసు కేసు నమోదు చేస్తామన్నారు. కోడ్ ముగిసిన వెంటనే జిల్లా కలెక్టర్‌తో అనుమతులు తీసుకుని బహిరంగ వేలం వేస్తామన్నారు. ఇప్పటివరకూ చేపలు పట్టిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారిణి కవిత పాల్గొన్నారు.



సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యులు

రక్తపోటు రాకుండా జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రక్తపోటు రాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎన్సీడీసీ అధికారి డాక్టర్ నివేదిత సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్యురాలు జోష్ణ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తపోటు దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ నివేదిత అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ అధిక రక్తపోటు వల్ల అనేక అనారోగ్య పరిస్థితులు తలెత్తుతాయన్నారు. అధిక పోటు వచ్చినప్పుడు గుండె, రక్తనాళాలు రక్తాన్ని సరిగా ప్రసరణ చేయడం కష్టం అవుతుందన్నారు. దీంతో గుండెపోటు కూడా వస్తుందన్నారు. శరీరంలో రక్త ప్రసరణ సక్రమంగా జరగాలంటే తగిన రీతిలో నడక, యోగా, వ్యాయామం చేయాలన్నారు. అవసరమైన పౌష్టికాహారం కూడా తీసుకోవాలన్నారు. బరువు తగ్గడంతో పాటు ఉప్పు తగ్గించడం, ధూమపానం, ఆల్కహాల్ తీసుకోవడం మానుకోవాలన్నారు. తరచూ బిపి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇలా రక్తపోటు నివారణకు చర్యలు తీసుకుంటామని ఆరోగ్య వైద్య సిబ్బందితో వైద్యులు ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, పిహెచ్ఎల్ లలిత కుమారి, డిసిఎం త్రిలోక్ నాథ్, సిబ్బంది అరుణ, సునీత, ఎంపిహెచ్‌ఒలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీటీ సిబ్బంది

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో శుక్రవారం బత్తలపల్లి రీజినల్ డైరెక్టర్ ప్రమీల ఆధ్వర్యంలో ఏరియా టీం లీడర్ కృష్ణ అధ్యక్షతన అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముదిగుబ్బ అర్బన్ సిఐ యతీంద్ర మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారన్నారు. అలాగే సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రస్తుత సమాజంలో బాలికలు, స్త్రీలు వివిధ కారణాల చేత హింసకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో స్త్రీల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవంగా మెలగాలని, పురుషులకు సమానంగా స్త్రీలకు హోదా కల్పించాలని కోరారు. కుటుంబంలో మహిళలకు తగిన స్థానం కల్పించి విలువలతో కూడిన గౌరవం ఇవ్వాలని, ఎటువంటి హింసకు గురి చేయరాదని సూచించారు. సమాజంలో మహిళలకు, వారి గౌరవానికి భంగం కలిగిస్తే చట్టరీత్యా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్కదేవతల ఎలవగంప ఊరేగింపు

ఓబుళదేవరచెరువు : మండల పరిధిలోని గౌనిపల్లి గ్రామంలో శుక్రవారం రిటైర్డ్ టీచర్ జివి.ఆదినారాయణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అక్కదేవతల యలవగంప కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామస్తుఉల ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు పచ్చ సామగ్రి తీసకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కదేవతలు కొలువైన ఇంటి నుంచి గౌనిపల్లి పురవీధుల్లో ఎలవగంప కార్యక్రమాన్ని ఉరుములు, వాయిద్యాల మధ్య ఊరేగించారు. ఇందులో భాగంగా అక్కదేవతల ప్రతిరూపంగా ఏడుగురు చిన్నారులకు ఒళ్లు నింపే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తజనం అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు



అక్కదేవతల ఎలవగంప ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

వైసిపి నాయకుల ప్రత్యేక ప్రార్థనలు



కడపలోని అమీన్‌పీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న వైసిపి మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం అసెంబ్లీ అభ్యర్థి దీపిక ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం కడప జిల్లా గండి క్షేత్రంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో వైసిపి మైనార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కడప పట్టణంలోని అమీన్ పీర్ దర్గాలో చాదర్ సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి కావాలని, దీపిక భారీ మెజార్టీతో గెలుపొందాలని కోరుతూ ప్రార్థనలు చేశామన్నారు. కార్యక్రమంలో వైసిపి మైనార్టీ విభాగం క్లస్టర్-1 కన్వీనర్ అయూబ్ బేగ్, నాయకులు షాజహాన్ బేగ్, రఫిక్ బేగ్, సాధిక్ బేగ్, ఆరిఫ్, ఇనాయత్, తౌసిప్, తదితర ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

గంగాభవానీ ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక గంగాభవానీ అమ్మవారు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి కలశ పూజ చేశారు. అమ్మవారి దర్శనం అనంతరం భక్తులకు అన్నదాన చేశారు. రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.